క్లుప్తంగా

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



బాధితురాలికి నగదు అందజేస్తున్న అధికారులు

దొరవారిసత్రం : అనారోగ్యంతో బాధపడుతూ ఉచ్చూరు ఫీల్డ్ అసిస్టెంట్ రామకృష్ణ మృతిచెందారు. దహన క్రియల కోసం ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.15 వేలు నగదును కుటుంబ సభ్యులకు శుక్రవారం అందజేసినట్లు ఏపీవో భాస్కరయ్య తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, ఈసీ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాగుపడిన సైదాపురం రోడ్డు



శరవేగంగా వేస్తున్న బీటీ రోడ్డు

సైదాపురం: మండల కేంద్రమైన సైదాపురంలో అధ్వానంగా ఉన్న రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం కలిగింది. తారు రోడ్డు వేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్ సీపీ మండల పార్టీ కన్వీనర్ మన్నారపు రవికుమార్ యాదవ్ శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ సైదాపురంలోని రోడ్డు అధ్వానంగా ఉందని సార్వత్రిక ఎన్నికల ముందు వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డికి విన్నవించామన్నారు. ఆయన అప్పటి జిల్లా కలెక్టర్ హరినారాయణన్‌తో మాట్లాడి రూ.2 కోట్లు మంజూరు చేయించారని తెలిపారు. ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిచిపోయాయని, కొద్ది రోజుల క్రితం రోడ్డు పనులు చేపట్టి పూర్తి చేశారని తెలిపారు.

టిప్పరు స్వాధీనం

సైదాపురం: మండలంలోని అనంతమడుగు సమీపంలో ఖనిజాన్ని అక్రమంగా తరలిస్తున్న టిప్పరును స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు అనంతమడుగు సమీపంలో తనిఖీ చేపట్టామన్నారు. అనుమతి లేకుండా ఖనిజాన్ని తరలిస్తున్న టిప్పరును స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. సీఐ విజయకృష్ణ ఆదేశాల మేరకు కేసు నమోదు చేసినట్లు స్టేషన్ ఇన్‌చార్జి సుదర్శన్ తెలిపారు.

వేడుకగా కల్యాణ వెంకన్న చక్రస్నానం



చక్రస్నాన ఘట్టాన్ని నిర్వహిస్తున్న వేద పండితులు

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట పట్టణం బ్రాహ్మణవీధిలో ఉన్న వ్యూహలక్ష్మీ సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి బ్రహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం చక్రస్నాన ఘట్టాన్ని వేదపండితులు భక్తశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయం వద్ద మహా పూర్ణాహుతి, వసంతోత్సవాలు చేపట్టారు. అనంతరం చక్రతాళ్వార్‌కు విశేష అభిషేకాలు చేసి తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కోనేరులో చక్రస్నానం చేశారు. రాత్రి స్వామిని ఊరేగించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చదలవాడ మోహన్‌కృష్ణ శర్మ, ఉదయ దాతలు, పీఠం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీ యాగం



చండీ యాగం చేస్తున్న వేద పండితులు

నాయుడుపేట టౌన్ : మండలంలోని అయ్యప్ప రెడ్డి పాళెంలో ఉన్న భగవతి మల్లికాంబ అమ్మవారి ఆరాధన మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం చండీ యాగాన్ని భక్తిశ్రద్ధలతో చేపట్టారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ధర్మకర్త అమాస రామనారాయణ, ఆధ్యాత్మిక గురువులు వటుకనాథ స్వామి, మల్లికార్జున పాల్గొన్నారు.

కండలేరులో 29.901 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 29.901 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. జలాశయంలోకి కండలేరు వరద కాలువ నుంచి 500 క్యూసెక్కులు, సోమశిల జలాశయం నుంచి 8,500 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. కండలేరు నుంచి సత్యసాయిగంగ కాలువకు 1,380, పిన్నేరు కాలువకు 40, లోలెవల్ కాలువకు 20, మొదటి బ్రాంచ్ కాలువకు 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్సు సర్వీసులు ప్రారంభం

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి ఆర్టీసీ డిపో పరిధిలో వెంకటగిరి–చెన్నై, వెంకటగిరి వయా తిరుపతి, నెల్లూరు – విజయవాడకు రెండు నూతన బస్సు సర్వీసు బస్సులను శుక్రవారం ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం అధికారం చేపట్టి వంద రోజుల వ్యవధిలో ప్రయాణికుల సౌకర్యార్థం 8 నూతన బస్సు సర్వీసులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రయాణికులు ఆటోలను ఆశ్రయించకుండా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, టీడీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

శక్తి స్వరూపిణీ నమోస్తుతే






రాజరాజేశ్వరిగా చెంగాళమ్మ పరమేశ్వరి, మహిషాసుర మర్దినిగా రాపూరమ్మ, వెంకటగిరి రూరల్ : కనకదుర్గాదేవిగా మందనాంచారమ్మ, కాళికామాతగా బాలా త్రిపుర సుందరిదేవి

సైదాపురం/కోట/సూళ్లూరుపేట/రాపూరు/నాయుడుపేట టౌన్/ చిట్టమూరు(వాకాడు)/వాకాడు/చిల్లకూరు/వెంకటగిరి రూరల్ : వెంకటగిరి, గూడూరు, సూళ్లూరుపేట నియోజకవర్గాల్లోని అమ్మవారి ఆలయాల్లో దసరా ఉత్సవాలను ఘనంగా జరుపుకుంటున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవార్లు వివిధ రూపాల్లో భక్తులను అనుగ్రహించారు. వారికి ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

- సైదాపురంలోని బాలాత్రిపురసుందరిదేవి అమ్మవారు శుక్రవారం కాళికామాత అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి చండీ హోమం, పూలంగి సేవ, విశిష్ట పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.
- కోట గ్రామదేవత కోటమ్మ శుక్రవారం మాతంగిదేవి అలంకారంలో భక్తులను అనుగ్రహించారు. ఈ సందర్భంగా 108 కలశాల నీటితో అమ్మవారికి అభిషేకాలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.
- సూళ్లూరుపేటలో వెలసిన చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారు శుక్రవారం రాజరాజేశ్వరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దీనికి నెల్లూరుకు చెందిన ముద్దలూరు మురళీకృష్ణమరాజు, అనిత దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. యాగశాలలో మహా చండీయాగం నిర్వహించారు. దీనికి సూళ్లూరుపేటకు చెందిన ఆత్రంబాకం దొరబాబురెడ్డి, సుహాసినీ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఒంగోలుకు చెందిన శ్రీనళినీ ప్రియ నృత్యనికేతన్ కళాకారులు కూచిపూడి నాట్య ప్రదర్శనలు చేశారు.

చెంగాళమ్మ పరమేశ్వరికి సారె సమర్పణ

సూళ్లూరుపేట చెంగాళమ్మ పరమేశ్వరికి శుక్రవారం సూళ్లూరు, నాగరాజుపురం, వాటంబేడు రోడ్డు ప్రాంతాలకు చెందిన చెందిన భక్తులు సారె సమర్పించారు. మహిళలు చీరలు, రవికెలు, పండ్లు తీసుకుని ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకున్నారు. వారికి ఆలయ సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మీ స్వాగతం పలికారు.

- నాయుడుపేట పట్టణంలోని పోలేరమ్మ, మూకాంబికా దేవి, స్వర్ణముఖి నది ఒడ్డున ఉన్న దుర్గామల్లేశ్వరిదేవి అమ్మవార్లు శుక్రవారం మహిషాసుర మర్దినిగా భక్తులను అనుగ్రహించారు. అలాగే శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి మహిషాసుర మర్దినిగా అలంకరించారు. కన్యకా పరమేశ్వరి అమ్మవారు మదుర మీనాక్షిగా భక్తులకు దర్శనమిచ్చారు. అఖిలాండేశ్వరిదేవి, అంకాళమ్మ, అన్నపూర్ణేశ్వరి దేవి, బేరిపేటలో ఉన్న మహాలక్ష్మమ్మ ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- చిట్టమూరు మండలంలోని మల్లాం మార్కేండేశ్వర స్వామి ఆలయంలో వెలసిన కామాక్షిదేవి శుక్రవారం మహిషాసుర మర్దిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు గూడలి సుధీర్ శర్మ విశేష అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు.
- రాపూరు మండలం పెంచలకోనలో వెలసిన ఆదిలక్ష్మీదేవి అమ్మవారు శుక్రవారం ధనలక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి ఉదయం స్నపన తిరుమంజనాన్ని ఘనంగా చేపట్టారు. రాత్రి ధనలక్ష్మీదేవిగా అలంకరించారు. అనంతరం తిరుచ్చిలో కొలువుదీర్చి క్షేత్రోత్సవం నిర్వహించారు. పోతుకొండలోని అంకమ్మ, రాపూరులోని కన్యకాపరమేశ్వరి, రాపూరు గ్రామదేవత రాపూరమ్మ మహిషాసుర మర్దినిగా దర్శనమిచ్చారు.
- వాకాడులోని నాగార్పమ్మ శుక్రవారం మహిసుర మర్దిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు కోటేశ్వరరావు అభిషేకాలు, గాజుల అలంకారం, కుంకుమ పూజలు చేశారు.
- చిల్లకూరు మండలంలోని తూర్పుకనుపూరులో వెలసిన ముత్యాలమ్మ ముత్యాల చీరలో శుక్రవారం దర్శనమిచ్చారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని మహిషాసుర మర్దినిగా ఊరేగించారు.
- వెంకటగిరి పట్టణం కర్ణమ్మవీధిలోని హరహర క్షేత్రంలోని కాత్యాయని అమ్మవారు మహిషాసుర మర్దినిగా, వెంకటేశ్వరస్వామి శ్రీకృష్ణ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వెలమపాళెం సమీపంలో ఉన్న మందనాంచారమ్మ కనకదుర్గాదేవి, కన్యకా పరమేశ్వరి శయన అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

దసరా పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి

వెంకటగిరి(సైదాపురం)/నాయుడుపేట టౌన్ : వెంకటగిరి, సూళ్లూరుపేట నియోజకవర్గాల్లోని ప్రజలు శనివారం దసరా పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య కోరారు. వారు శుక్రవారం ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. దుర్గా మాతా ఆశీస్సులతో ప్రజలకు, నాయకులు, కార్యకర్తలకు ఆయురారోగ్యాలు, ఐష్టైశ్వర్యాలు కలగాలని కోరారు.

విశ్వశాంతిలో ప్రత్యేక పూజలు

రాపూరు: మండలంలోని పెంచలకోనలో ఉన్న మాత్రుదేవి విశ్వశాంతి ఆశ్రమంలో శుక్రవారం లలితాంబికా దేవికి ప్రత్యేక హోమాలు, పూజలను మాతాశ్రీ విజయేశ్వరిదేవి చేశారు. ఆమె మాట్లాడుతూ నవరాత్రుల్లో అమ్మవారిని పూజిస్తే అందరికీ మేలు జరుగుతుందన్నారు. ఆశ్రమంలో గణేష, నవగ్రహ శాంతి, రుద్ర, గాయత్రీ హోమాలు, లలితా పరమేశ్వరిదేవికి కుంకుమార్చన, దర్బారు సేవ, ఏకాంత సేవ, పల్లకి సేవ, ఊంజల్ సేవ చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

నాయుడుపేటలో దసరా సందడి

నాయుడుపేట టౌన్ : విజయ దశమి వేడుకలను ఘనంగా జరుపుకునేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. పూజ సామగ్రి, వివిధ వస్తువుల కొనుగోలుదారులతో పట్టణంలోని దుకాణాలు కిటకిటలాడుతున్నాయి. ముఖ్యంగా బొరుగులు, శనగలతో పాటు అరటి పిలకలు, తోరణాలు తదితర వాటిని ప్రత్యేకంగా స్టాల్స్ ఏర్పాటు చేసి విక్రయాలు జరుపుతున్నారు. పట్టణంలోని పాత బస్టాండు. గాంధీ పార్కు, మసీదు వీధి, వెల్‌కం సెంటర్, గడియారం సెంటర్, బజారువీధి తదితర ప్రాంతాలు ప్రజలతో రద్దీగా మారాయి.

అంకమ్మను దర్శించుకున్న నేదురుమల్లి, మేరిగ



అంకమ్మ దసరా ఉత్సవాల పత్రికలు విడుదల చేస్తున్న రామ్‌కుమార్‌రెడ్డి, మేరిగమురళీధర్, మధుసూదన్‌రెడ్డి

రాపూరు: మండలంలోని వేపినాపి సమీపంలో ఉన్న పోతుకొండలో వెలసిన అంకమ్మను శుక్రవారం వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, సీఈసీ సభ్యుడు పాపకన్ను రాజశేఖర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పాపకన్ను మధుసూదన్‌రెడ్డితో కలిసి దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తెగచర్ల వైఎస్సార్‌సీపీ నాయకుడు బొడ్డు మధుసూదన్‌రెడ్డి కుమారుడు అవినాష్‌రెడ్డి, సిద్ధవరానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కయ్యూరు పరంధామిరెడ్డి కుమారుడు వెంకటసునీల్ కుమార్‌రెడ్డి నలుగు వేడుకల్లో పాల్గొన్నారు. జేసీఎస్ కన్వీనర్ దందోలు నారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ పెంచలరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రైతు సంఘ కార్యదర్శి బత్తిన పట్టాభిరామిరెడ్డి, తిరుపతి పార్లమెంట్ మైనార్టీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఖాదర్ బాషా పాల్గొన్నారు.



సిద్ధవరంలో నలుగు వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

మద్యం షాపులకు 617 దరఖాస్తులు

గూడూరు రూరల్/నాయుడుపేట టౌన్/సూళ్లూరుపేట : గూడూరు, చిల్లకూరు, నాయుడుపేట, ఓజిలి, పెళ్లకూరు మండలాల్లోని మద్యం షాపులకు 400 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సీఐలు కరీమా బేగం, సీఐ ఇండ్ల అరుణకుమారి తెలిపారు. వారు శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ గూడూరు మున్సిపాలిటీలో 12 షాపులకు 146, చిల్లకూరులోని ఆరు షాపులకు 54, నాయుడుపేటలోని 13 మద్యం షాపులకు 106, ఓజిలిలోని 2 మద్యం షాపులకు 50, పెళ్లకూరులోని 2 మద్యం షాపులకు 44 దరఖాస్తులు వచ్చినట్టు తెలిపారు. అలాగే సూళ్లూరుపేటలో 14 షాపులకు 70, తడలోని 5 షాపులకు 118, దొరవారిసత్రంలో రెండు షాపులకు 29 దరఖాస్తులు వచ్చాయి. 12, 13 తేదీల్లో దరఖాస్తుల పరిశీలన, 14న లక్కీ డ్రా ద్వారా షాపుల కేటాయింపు ఉంటుందని తెలిపారు.

గంగ కాలువ కట్ట ధ్వంసం

పెళ్లకూరు: మండలంలోని చెన్నప్పనాయుడుపేట సమీపంలోని తెలుగు గంగ కాలువ కరకట్టను అధికార పార్టీ వర్గీయులు యంత్రాలతో తవ్వేశారు. అక్కడి నుంచి గ్రావెల్‌ను లారీల్లో నాయుడుపేట పట్టణంలోని లేఅవుట్లకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. సుమారు అర కిలోమీటరు దూరం వరకు గంగ కాలువ కరకట్టను యంత్రాలతో ధ్వంసం చేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం తెలిసినా అధికారులు పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గూడలిలో ఇసుక రీచ్ ఏర్పాటుకు చర్యలు

కోట: గూడలిలో స్వర్ణముఖి నది వద్ద ఇసుక రీచ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా తెలిపారు. ఆయన శుక్రవారం అధికారులతో కలిసి స్వర్ణముఖి నది పరివాహక ప్రాంతాన్ని పరిశీలించారు. ఇసుక నాణ్యత, ఎన్ని మెట్రిక్ టన్నుల మేర ఇసుకను తవ్వవచ్చు తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇసుక రీచ్‌కు 500 మీటర్ల సమీపంలోనే నిల్వ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు రెండు చోట్ల స్థలాలను పరిశీలించారు. వాహనాలు వెళ్లేందుకు అనువైన స్థలాన్ని ఎంపిక చేయాలని అధికారులను ఆదేశించారు. త్వరలోనే గూడలిలో ఇసుక రీచ్ ప్రారంభిస్తామని తెలిపారు. మైనింగ్ ఏడీ శ్రీనివాసరావు, ఇరిగేషన్‌శాఖ ఈఈ శ్రీనివాసులు, తహసీల్దార్ జయజయరావు, గూడూరు ఆర్డీవో ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

ఇసుక రీచ్ కోసం స్వర్ణముఖినది పరిశీలన

పెళ్లకూరు: ఇసుక రీచ్ ఏర్పాటు కోసం పుల్లూరు, కలవకూరు గ్రామాల వద్ద స్వర్ణముఖి నది పరిసరాలను శుక్రవారం సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి పరిశీలించారు. వినియోగదారుల సౌలభ్యం కోసం స్వర్ణముఖినదిలో ఇసుక రీచ్ ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. కలవకూరు వద్ద ఇసుక రీచ్‌కు అనుకూలంగా ఉన్న విషయాన్ని జిల్లా ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఆమె తెలిపారు. తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డి, మండల సర్వేయర్ పూజిత, ఆర్ఐ సంతోషిణిబాయి, వీఆర్వో వంశీ, సిబ్బంది సూర్య, లక్ష్మణ్ పాల్గొన్నారు.



గూడలిలో ఇసుక రీచ్ ఏర్పాటు చేయనున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న గూడూరు సబ్‌కలెక్టర్

ప్రజా సమస్యల పరిష్కారమే సీపీఎం ధ్యేయం

నాయుడుపేట టౌన్ : ప్రజా సమస్యల పరిష్కారమే సీపీఎం ధ్యేయమని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వి.నాగరాజు తెలిపారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో పార్టీ పటిష్టత, ప్రజలు, కార్మికుల సమస్యలపై చేపట్టాల్సిన పోరాటాలపై ప్రణాళికలు రూపొందించినట్లు వెల్లడించారు. అనంతరం జిల్లా కార్యవర్గ సభ్యులు పుట్లయ్య, నాయుడుపేట మండల కార్యదర్శిగా ఎస్ మహేష్‌ను ఎన్నుకున్నారు. నాయకులు ముకుంద, వీరాస్వామి, శంకర్, శ్రీనివాసులు, శ్యామలమ్మ, విజయమ్మ, వాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని బేరిపేట క్రిస్టియన్ శ్మశానవాటిక సమీపంలో ఉన్న ఇనుప విద్యుత్ స్తంభం తుప్పుపట్టి పడిపోయే స్థితికి చేరింది. విద్యుత్ తీగలు కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా మారాయి. ఈదురు గాలులు వీస్తే స్తంభం పడిపోయే విధంగా ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. విద్యుత్ స్తంభాన్ని మార్చి తీగలను సరిచేయాలని పలుమార్లు అధికారులను కోరినా ఫలితం లేదని ఆరోపిస్తున్నారు.



వాలిపోయి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలు

చికిత్స పొందుతూ మహిళ మృతి

చిల్లకూరు : కొడుకు కత్తితో దాడి చేయడంతో గాయపడిన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం వేకువ జామున మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని కమ్మవారిపాళెం గ్రామానికి చెందిన సుశీలమ్మను ఆమె కుమారుడు మనోజ్ కత్తితో తలపై దాడి చేసి గాయపరిచాడు. ఈ క్రమంలో ఆమె తీవ్రంగా గాయపడడంతో ఆసుపత్రిలో చేర్పించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. సీఐ కిషోర్‌బాబు, ఎస్ఐ సురేష్‌బాబు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

14 నుంచి భారీ వర్షాలు!

సూళ్లూరుపేట: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వల్ల 14, 15, 16 తేదీల్లో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని సూళ్లూరుపేట మున్సిపల్ కమిషనర్ కే.చిన్నయ్య తెలిపారు. వాతావరణ శాఖ అధికారుల అంచనా ప్రకారం అల్పపీడనం వాయుగుండంగా మారి తుపాన్‌గా బలపడుతుందని పేర్కొన్నారు. దీంతో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పట్టణ ప్రజలు అత్యవసర సేవల కోసం పురపాలక సంఘం వారి హెల్ప్‌లైన్ 38623-244001, 8297622273లో సంప్రదించాలని ఆయన కోరారు.